చెత్త కుండీ పక్కన మృత శిశువు

విశాలాంధ్ర-మధురవాడ : ఆదివారం ఉదయం అప్పుడే పుట్టిన,ఇంకా కళ్ళుతెరవని పసికందు (శిశువు) మృతదేహం జీవీయంసీ, మధురవాడ 5వ వార్డు, మారికవలస రాజీవ్ గృహకల్ప అన్నా కేంటీన్ (వినియోగంలో లేని రైతు బజారు)వెనుక చెత్త కుండీ ప్రక్కన కనిపించిది. ఆ మృత శిశువును చూసిన స్థానికులు పీయం పాలెం పోలీసులకు సమాచారమిచ్చారు. చిరు జల్లుతో కూడిన వాతావరణం కావటంతో పోలీసుల సూచనపై స్థానికులే ఆమృత శిశువును తరలించే కార్యక్రమాన్ని చేపట్టారు. కాగా అక్కడ మృతశిశువును పడవేయటంపై స్థానికులు పలు రకాల అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ ఊహల కథనాలు ఎలాపున్నా మనుషులలో మృగ్యమౌతున్న విలువలకు ఇది దర్పణం పడుతుంది.

ఆర్టీఈ అడ్మిషన్లు లోటుపాట్లుపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించాలి

ఆంధ్రప్రదేశ్ చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం...

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : పేద విద్యార్థుల విద్యా భ్యున్నతిని దృష్టిలో ఉంచుకొని అమలు చేస్తున్న ఉచిత నిర్భంధ విద్యా హక్కు చట్టం(ఆర్టీఈ)అడ్మిషన్ల లోటు పాట్లుపై ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పూర్తి దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ రాష్ట్ర సమగ్ర శిక్ష ఉన్నతాధికారులకు లేఖ వ్రాసినట్లు చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి తెలిపారు. ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలు, వివిధ యాజమాన్య పాఠశాలల్లో, విద్యాహక్కు చట్టం, 2009, సెక్షన్ 12(1)(సి)ను అనుసరించి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మొదటి రౌండ్‌లో కేటాయించిన అడ్మిషన్లలో అధికశాతం పాఠశాలల యాజమాన్యాలు నిరాకరిస్తున్న విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వానికి నివేదించామని ఆమె అన్నారు,పాఠశాలల యాజమాన్యాలు అసలు ఎందుకు నిరాకరిస్తున్నారో సంభందిత పాఠశాలల వారితోను వారి అసోసియేషన్లుతోను ప్రభుత్వం సమావేశాన్ని ఏర్పాటుచేసి వారి లోటుపాట్లు,ఇబ్బందులు తదితర అభిప్రాయాలను పరిశీలనలోకి తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు,ఈ విధమైన ప్రణాళికాయుత ముందస్తు చర్యలతోనే రాష్ట్రంలో శాతశాతం ఆర్టీఈ చట్టం అమలుతో పాటు పేద పిల్లలను,వారి హక్కులను కాపాడాలని కోరినట్లు చెప్పారు,ప్రతీ ఏడాది ఆర్టీఈ అడ్మిషన్ల ప్రారంభంలో ఇవే సమస్యలు పునరావృతం అవుతున్న నేపథ్యాన ఇటు విద్యార్థులు,అటు తల్లిదండ్రుల బాధలు,వేదనలు వర్ణనాతీతంగా ఉంటున్నాయని అన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని,ప్రణాళికాయుతంగా అడుగులువేసి ఆర్టీఈ చట్టాన్ని పరిరక్షిస్తూ, భవిష్యత్‌లో న్యాయస్థానాల్లో న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా బాలల హక్కులను కాపాడాలని కోరినట్లు ధనలక్ష్మి కోరారు.

ఘనంగా సిఐటియు జోన్ మహాసభలు

విశాలాంధ్ర - తగరపువలస : చిట్టివలస జూట్ మిల్ కళ్యాణ్ మండపంలో సిఐటియు జోన్ మహాసభలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన విశాఖ సిఐటియు జిల్లా కార్యదర్శి మణి మాట్లాడుతూ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలని నిర్వీర్యం చేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చి కార్మికులను బానిసలుగా చేయాలని చూస్తున్నాయని, కార్మికుల కనీస వేతనాలు అమలు చేయడం లేదని, గ్రాట్యుటీ ఈఎస్ పిఎఫ్ లాంటి సౌకర్యాలు ఎక్కడా కార్మికులకు కల్పించడం లేదని ఎన్నో పోరాటాలు చేసి కార్మికులు సాధించుకున్న పని గంటలు హక్కులు పని గంటలు పెంచే విధంగా ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని దీన్ని సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తూ జూలై 9వ తేదీన జరగబోయే అఖిల భారత జాతీయ సమ్మె ని జయప్రదం చేయాలని ఆమె కార్మికులకు విజ్ఞప్తి చేశారు. సిఐటియు భీమిలి జోన్ అధ్యక్షులు ఆర్ఎస్ఎన్ మూర్తి గ మాట్లాడుతూ శ్రామిక మహిళలు శ్రమ దోపిడికి గురవుతున్నారని ఆశ అంగన్వాడి వివోఏ ఎండిఎం సాక్షరభారత వెలుగు ఆర్పీలు లాంటి స్కీం వర్కర్లు శ్రమ దోపిడీకి గురవుతున్నారని వీళ్ళందరికీ కనీస వేతనాలు అమల చేయాలని సిఐటియు డిమాండ్ చేస్తుందని అవుట్సోర్సింగ్ కాంటాక్ట్ కార్మికుల పర్మిట్ చేయాలని కనీస వేతనాలు 26,000 చెల్లించాలని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయొద్దని విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకం ఆపాలని తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆయన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాబోయే మూడు సంవత్సరాలు కాలంలో కార్మికులకు ప్రజలకి సిఐటియు అండగా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా భీమిలి సిఐటియు జోన్ నూతన కమిటీ కమిటీ ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా ఆర్ఎస్ఎన్ మూర్తి కార్యదర్శిగా ఎస్.అప్పలనాయుడులను ఎన్నుకున్నారు. నాగరాజు సీతాదేవి కంచమ్మ శ్రీను ఉపాధ్యక్షులుగా సహాయ కార్యదర్శులుగా రవ్వ నర్సింగరావు నేలతి రాము సన్యాసి పైడమ్మ పార్వతి కోశాధికారిగా పంపాను సూర్యనారాయణ కే వెంకటలక్ష్మి కమిటీ నెంబర్లుగా గురప్ప ఎన్ని బాబు రాజేష్ తదితరులు ఎన్నుకోవడం జరిగింది. ఈ సభలో వివిధ రంగాల నుంచి కార్మికులు పాల్గొన్నారు.

మీడియా సంస్థపై దాడి హేయమైన చర్య

ఓజా వ్యవస్థాపక అధ్యక్షుడు వాల్మీకి నాగరాజు

విశాలాంధ్ర-పెందుర్తి : ప్రజాస్వామ్య దేశంలో మీడియా సంస్థలపై దాడి చేయడం హేయమైన చర్యగా అవర్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాల్మీకి నాగరాజు అభివర్ణించారు. హైదరాబాదులో ఓ టివి చానెల్ ప్రధాన కార్యాలయంపై దుండగులు దాడి చేసి విధ్వంసం సృష్టించడం దారుణమని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి దాడులకు తావు లేదని, ప్రజలు, సమాజం ఇలాంటి వాటిని ఎప్పటికి ఆమోదించరని పేర్కొన్నారు. టీవీ చానెల్ పై దాడి చేసినవారిపై తెలంగాణ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వాల్మీకి నాగరాజు డిమాండ్ చేశారు. టివి చానెల్ యాజమాన్యానికి సంఘీభావం తెలిపిన నాగరాజు ఇలాంటి దాడులు మీడియా స్వచ్ఛను హరించడమేనని, ప్రజాస్వామ్య దేశంలో రాజకీయ పార్టీలు,నాయకులు దాడి చేయడం అత్యంత దారుణమని, ఇలాంటి దాడులను జర్నలిస్టులందరూ ఐకమత్యంగా ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

సీనియర్ జర్నలిస్ట్ 'పైల దివాకర్' మృతి

విశాలాంధ్ర - విశాఖ సిటీ : సీనియర్ జర్నలిస్ట్, వైసిపి పీఆర్వో పైల దివాకర్ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు. కడవరకు తనకు పరిచర్యలు అందించిన తన భార్య పైల రమణి తీవ్ర దుఃఖం లో మునిగిపోయారు. ఒంటరిని చేసి వెళ్ళిపోయావా అని భోరున విలపిస్తోంది. ఉన్న ఒక్కగానొక్క కుమారుని పోగొట్టుకొని పుత్ర శోకంలో మునిగిన ఆమెకు భర్త కూడా దూరం కావడం జీర్ణించుకోలేకపోతోంది. దివాకర్ గత కొంత కాలంగా ఆరోగ్య సమస్యలతో సతమత మైయ్యారు. తీవ్ర అస్వస్థతకు గురై కొన్నాళ్లపాటు ఇంటికే పరిమితమైనారు. ఈ విషయం తెలిసిన కొందరు జర్నలిస్టులు, వైసీపీ నాయకులు దివాకర్ ఇంటికి వెళ్లి అతనిని పరామర్శించారు. వారి దంపతులకు ధైర్యం చెప్పి అండగా మేము ఉంటాం ధైర్యంగా ఉండమని భరోసా ఇచ్చారు. నగరంలోని ఇటు జర్నలిస్టుల తోనూ అటు రాజకీయ నాయకులతోనూ మంచి సంబంధాలు కలిగి అందరి మన్ననలను పొందారు. ఇటీవల ఆయన ఆరోగ్యం విషయమంగా మారడంతో చికిత్స నిమిత్తం కొమ్మాదిలోని గాయత్రి ఆసుపత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన తుది శ్వాస విడిచారు. ఆయన మృతికి జర్నలిస్ట్ సంఘాలు, నగరంలోని జర్నలిస్టులు, వైసీపీ నాయకులు విచారం వ్యక్తం చేశారు. మంచి జర్నలిస్టు మిత్రుని కోల్పోయామని సానుభూతి తెలియజేశారు.

నేడు కలెక్టరేట్లో పీజీఆర్ఎస్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం సోమవారం యథావిధిగా పి.జి.ఆర్.ఎస్. నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. విశాఖపట్నం కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, అన్నివిభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. దీంతో పాటు ప్రజల సౌలభ్యం నిమిత్తం అందుబాటులోకి తీసుకొచ్చిన కాల్ సెంటర్ 1100ను సంప్రదించి కూడా వినతులను నమోదు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ప్రజలు ఈవేదికలను ఉపయోగించుకోవాలని, సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ సూచించారు. అధికారులంతా నిర్ణీత సమయానికి పీజీఆర్ఎస్ కార్యక్రమానికి చేరుకోవాలని ప్రకటన ద్వారా ఆదేశించారు.

జమ్ముల రామకృష్ణకు అభినందనలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఉద్యోగిగా ముప్పై ఏడు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసి నేడు ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా సిపిఐ పార్టీ, స్టీల్ ఏఐటీయూసీ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఉక్కు ఏఐటీయూసీ నాయకులు యేల్లేటి శ్రీనివాసరావు మాట్లాడుతు సిపిఐ పార్టీ నాయకునిగా, ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శిగా జమ్ముల రామకృష్ణ చేసిన కార్మిక సేవలు చిరస్థాయిగా నిలుస్తాయి అన్నారు. భవిష్యత్తులో ఏఐటీయూసీ యూనియన్ కు, సిపిఐ పార్టీకి తన యొక్క సేవలు అందించాలని ఈ సందర్భంగా రామకృష్ణ కు విజ్ఞప్తి చేశారు. ఈయన తో పాటు ఉక్కు ఉద్యోగులుగా సుదీర్ఘ కాలం తమ సేవలను అందించి ఉద్యోగ విరమణ పొందుతున్న డి ఆనంద్, సన్నిబాబులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనిపెద్ది మాసేను రావు, డొక్క నరసింగరావు, బిఎంఎల్ నాయుడు, దేముడు, గోవిందరెడ్డి, నందికి చిన్నరావు లు ఉక్కు ఉద్యోగులను అభినందించారు.

కార్యోన్ముఖుడు... ఉక్కు ఉద్యోగి ఆనంద్

- విశాఖ ఉక్కు కర్మాగారంతో 34 ఏళ్ల అనుబంధం
- నేతగా కమ్యూనిస్టు భావజాలంతో విశేష సేవలందించిన కామ్రేడ్ ఆనంద్

విశాలాంధ్ర-గాజువాక : భారత ప్రభుత్వ రంగ పరిశ్రమ విశాఖ ఉక్కు కర్మాగారంలో 21 జనవరి 1992లో జూనియర్ ట్రైనీగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. పరివర్తన క్రమంలో ఆయన అంచలంచెలుగా టెక్నీషియన్, చార్జ్మెన్, సీనియర్ ఫోర్ మెన్, జనరల్ ఫోర్ మెన్‌గా పలు హోదాల్లో విధులు నిర్వహిస్తూ 30 జూన్ 2025న ఉద్యోగ విరమణ చేస్తున్నారు. గత 34 సంవత్సరాలుగా విశాఖ ఉక్కు కర్మాగారంలో ఉద్యోగిగా, ఏఐటియుసి నాయకుడిగా ఉక్కు ప్రగతికి కృషి చేసారు. అధికారులు, తోటి ఉద్యోగుల మన్ననలు పొంది అందరిలో ఒకడిగా, భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రదర్శించారు. మంచి కార్యసాధకుడిగా అందరి మన్ననలు పొందడం ఆనంద్ ఉన్నతికి ఒక గీటురాయిగా చెప్పవచ్చు.

- భావోద్వేగం ఆనంద్ మాటల్లో.... విశాఖ ఉక్కు కర్మాగారంలో సుదీర్ఘమైన 34ఏళ్ల నా సర్వీసు కాలంలో ఎంతో సంతోషంగా ఉన్నాను. పరిశ్రమతోను, పట్టణంతోనూ నేను వీడని ఒక అనుబంధాన్ని పెంచుకున్నాను. అందరూ నావాళ్లే అన్న భావోద్వేగం నాలో ఎప్పుడూ వెలుగుతూనే ఉంటుంది.

ఉక్కు ఉద్యోగిగా, స్టీల్‌ప్లాంట్‌లోని ప్రధాన కార్మిక సంఘమైన ఏ.ఐ.టి.యు.సిలో ఉపాధ్యక్షునిగా కీలకంగా పనిచేస్తూ, కార్మిక వర్గానికి కించిత్ సేవలను అందించే భాగ్యం నాకు కలిగింది. అంతేకాకుండా భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ)లో పార్టీ నేతగా ప్రస్తుతం సిపిఐ జిల్లా సమితి సభ్యునిగా కొనసాగుతూ ఉన్నాను. ప్రజా ఉద్యమాలలో బాగస్వామినయ్యాను.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి జిల్లాలోని గోదావరి ఖని పట్టణంలో జన్మించి అక్కడే ప్రాథమిక విద్య ప్రాథమికోన్నత పాఠశాల (యూపిఎస్)లో 7వ తరగతి వరకు, 8వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివాను. ఆతరువాత పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఐ.టి.ఐలో ఫిట్టర్ కోర్స్ పూర్తిచేసి, విశాఖ ఉక్కు కర్మాగారంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టి 34 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకొని ఉద్యోగ విరమణ చేస్తున్నాను.

విద్యార్థి దశలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షునిగా, రాష్ట్ర సమితి సభ్యునిగా విద్యారంగ సమస్యలపై పోరాటం చేయడం జరిగింది. విద్యార్థి దశలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం జరిగింది. విశాఖ ఉక్కు కర్మాగారంలో ఉద్యోగిగా ఉంటూ సంతోషంగా ఉద్యోగ విరమణ చేయడం నాకు నేనుగా గర్వపడుతున్నాను.

ఉక్కు కర్మాగారంతో నా అనుబంధం నేనెప్పుడూ మరచిపోలేను. థాంక్స్ టు వైజాగ్ స్టీల్‌ప్లాంట్

కృతజ్ఞతలతో...
జి. ఆనంద్, జనరల్ ఫోర్ మెన్,
విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్,
సిపిఐ జిల్లా సమితి సభ్యులు, విశాఖపట్నం.

వర్షాకాలం వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలి

విశాలాంధ్ర-విశాఖపట్నం : కురుస్తున్న వర్షాలతో విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని తగు జాగ్రత్తలు తీసుకొని వ్యాధుల నుంచి అప్రమత్తంగా ఉండాలని లయన్స్ క్యాన్సర్ జనరల్ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వి. ఉమామహేశ్వరరావు సూచించారు. నీటి నిల్వలే దోమల ఉత్పత్తికి ఆవాసాలు అని నీటి నిలువ లేకుండా జాగ్రత్త పడాలన్నారు. ముంద జాగ్రత్త చర్యలతో రక్షణ పొందే అవకాశం ఉంటుందని, తాజాగా కురుస్తున్న వర్షాలు మరియు వాతావరణంలో మార్పుల వల్ల వైరల్ ఫీవర్స్ ప్రబలుతున్నాయన్నారు. మరోవైపు దోమ కాటు ద్వారా డెంగ్యూ, మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశాలున్నాయని, వర్షాల కారణంగా పేరుకుపోయిన నీటి నిల్వలు దోమల ఉత్పత్తికి ఆవాసాలుగా మారుతున్నాయి. ముందు జాగ్రత్తలో భాగంగా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వల తొలగింపు ప్రక్రియ చేపట్టడం ఎంతో అవసరం అని చెప్పారు. ఈ చర్య ద్వారా డెంగ్యూ, మలేరియా, చికున్గున్యా జ్వరాల బారిన పడకుండా రక్షణ పొందగలం అన్నారు. దోమ కాటు వేసిన ఏడు రోజుల వ్యవధిలో జ్వరం వస్తుందని, ముందస్తుగా రక్త పరీక్షలు చేయించుకొని, దానిలో మలేరియా నిర్ధారణైతే 15రోజుల పాటు వైద్యం పొందాల్సి ఉంటుందన్నారు. మలేరియా నిర్ధారణ కాకపోతే వెంటనే డెంగ్యూ పరీక్ష చేసుకోవాలని, అది నిర్ధారణైతే వైద్యుడి సూచన మేరకు చికిత్స పొందాలన్నారు. మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ తోపాటు వైద్య పరీక్షలన్నీ మీకు అందుబాటులో ఉన్న ఆరోగ్య కేంద్రాల్లో చేయించు కోవాలన్నారు. ఈమధ్య వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. వర్షపు నీరు ఇంటి పరిసరాల్లోని ఖాళీ సీసాలు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వస్తువులు, టైర్లు, రుబ్బురోలు తదితర వాటిలో నిల్వ ఉండే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రతి చిన్న ఖాళీ వస్తువులో నీటి నిల్వలున్నా దోమల వృద్ధికి ఆవాసాలుగా మారుతాయి. వారం రోజులు దాటి నిల్వ ఉండే నీటిలో లార్వా ఏర్పడుతుంది. అది కాస్తా 12 రోజుల వ్యవధిలో వివిధ దశల అనంతరం దోమగా రూపాంతరం చెందుతుంది. దోమల కాటు ద్వారా విష జ్వరాలు ప్రబలుతాయి. ముందుగానే వీటిని నిర్మూలించాల్సి ఉందని చెప్పారు. స్థానిక సంస్థలు ప్రతి శుక్ర, మంగళవారాల్లో నిర్వహించే డ్రైడే కార్య క్రమంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం అన్నారు. అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వర్షాకాలంలో వచ్చే వ్యాధులకు దూరంగా ఉండవచ్చు అని చెప్పారు.

ఉద్యానవన శాఖ రైతులకు రాయితీ పథకాలు సద్వినియోగం చేసుకోండి

ఉద్యాన శాఖ అధికారి సోని

విశాలాంధ్ర-ఆనందపురం : రైతుల ఆదాయం పెంచడం, తద్వారా సాగు విధానాలను ఆధునీకరించడం లక్ష్యంగా ఉద్యాన శాఖ ద్వారా అనేక రాయితీ పథకాలు అమలులో ఉన్నాయని ఉద్యాన శాఖ అధికారి సోని పేర్కొన్నారు. కూరగాయలు, పండ్ల తోటలు, పువ్వులు, నిల్వ గదులు వంటి విభాగాల్లో పలు ప్రోత్సాహక పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. రైతులు ఆధునిక పద్ధతుల్లో సాగు చేయడంలో ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.

ప్రధాన పథకాలు వాటి వివరాలు...

హైబ్రిడ్ కూరగాయల సాగు : 40 శాతం రాయితీతో గరిష్టంగా రూ.24,000/హెక్టారుకు మంజూరు. ఒక్క రైతుకు 2 హెక్టార్ల వరకూ వర్తింపు.

హైబ్రిడ్ విత్తనాల రాయితీ : రైతులు కొనుగోలు చేసిన విత్తనాలపై 50 శాతం రాయితీతో గరిష్టంగా రూ.3,000/హెక్టార్.

శాశ్వత పందిళ్లు : 50 శాతం రాయితీతో రూ.2.5 లక్షలు/హెక్టార్ మంజూరు. ఒక్క రైతుకు 1 హెక్టార్ వరకే వర్తింపు.

ట్రెల్లిస్ పద్ధతులు : 50 శాతం రాయితీతో రూ.18,750/హెక్టార్ మంజూరు.

మల్చింగ్ (పొలం కవరింగ్) : 50 శాతం రాయితీతో రూ.16,000/హెక్టార్ అందుబాటులో

విడిపువ్వుల సాగు : గులాబీ, చామంతి, మల్లె పూల సాగుకు 40 శాతం రాయితీతో రూ.20,000/హెక్టార్ మంజూరు.

పండ్ల తోట విస్తరణ : మామిడి-రూ.50,000 (2 సంవత్సరాల్లో) జామ-రూ.80,000, బొప్పాయి- రూ.30,000, అరటి (టిష్యూ కల్చర్) - రూ.70,000 (2 సంవత్సరాల్లో) (ఈ పంటలన్నింటికీ 40 శాతం రాయితీ వర్తించనుంది)

కలెక్షన్ సెంటర్ : తోట వద్ద ఉత్పత్తుల సేకరణ, గ్రేడింగ్, నిల్వ కోసం 75 శాతం రాయితీతో గరిష్టంగా రూ.11.25 లక్షలు/యూనిట్ మంజూరు.

ప్యాక్ హౌస్ : ఉత్పత్తుల ప్యాకింగ్ కోసం 50 శాతం రాయితీతో రూ.2 లక్షలు/యూనిట్ మంజూరు.

సౌర శక్తి ఆధారిత కోల్డ్ రూమ్స్: 30 మెట్రిక్ టన్నుల సామర్థ్యం - రూ.18.20 లక్షలు

10 మెట్రిక్ టన్నులు (సోలార్ కనెక్షన్‌తో) - రూ.4.38 లక్షలు

విద్యుత్ : సోలార్ కలిపిన విధానం - రూ.5.25 లక్షలు.

ఈ పథకాలకు 35 శాతం రాయితీ వర్తించనుంది.

రైతులు తమ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి మరిన్ని వివరాలు పొందగలరని, అధికారుల సూచన. ఈ పథకాల అమలుతో వ్యవసాయం మరింత లాభదాయకంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రౌడీ షీటర్లకు పోలీసులు కౌన్సిలింగ్

విశాలాంధ్ర-పెందుర్తి : పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు సీఐ కెవి సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్సై స్వామి నాయుడు కౌన్సిలింగ్ నిర్వహించారు ఆదివారం ఉదయం పలు ప్రాంతాలకు చెందిన రౌడీషీటర్లను స్టేషనుకు పిలిపించి మంచి ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. నడవడిక, ప్రవర్తనలో మార్పు రాకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఎస్సై స్వామి నాయుడు, రౌడీషీటర్లకు హెచ్చరించారు.

సామాన్య ప్రజల ప్రయోజనాలు కేంద్ర బిందువుగా విధానాలు వుండాలి

- అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో
- ఈరోజు జరిగిన "విశాఖపట్నం అభివృద్ధి- నిధులు- సంస్కరణలు" సదస్సు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : సదస్సులో ముఖ్య వక్తగా పాల్గొన్న విశ్రాంత ఆచార్యులు సి.రామచంద్రయ్య మాట్లాడుతూ సరిగ్గా నిలబడే పునాది లేకపోయినా గాల్లోకి ఎగురుదామనే ప్రయత్నాలు చేస్తున్నట్టుగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని, నగరాల్లో ఫ్లైఓవర్లు, మెట్రో రైళ్లు ఎన్ని వచ్చినా రద్దీ తగ్గదని హైదరాబాద్ అనుభవాలు తెలుపుతున్నాయని, ప్రజా రవాణా వ్యవస్థ మాత్రమే దీనికి పరిష్కారమని ప్రజారవాణా తీసుకొచ్చి నట్లయితే రద్దీ, ప్రమాదాలు, కాలుష్యం, అసహనం వంటివి తగ్గుతాయనన్నారు. ప్రజా రవాణా వ్యవస్థ ప్రజల్ని ఐక్యం చేస్తుందని, వ్యక్తిగత రవాణా వ్యవస్థ ప్రజల్ని వేరు చేస్తాయని, మెట్రో రైళ్ళ వలన ఖర్చు ఎక్కువ, ఉపయోగించుకునే ప్రజల సంఖ్య తక్కువ అని, పరిశుభ్రమైన మంచినీరు అందించడమనేది ప్రభుత్వాల బాధ్యత అని, సింగపూర్ నమూనా గురించి పదేపదే వల్లించే నేతలు ఆ సింగపూర్ లో అమలవుతున్నటువంటి రవాణా, మంచినీటి సదుపాయం కల్పన వంటివాటిని ఇక్కడ అమలు చెయ్యాలని,మార్కెట్ వాల్యూ మీద ఇంటి పన్ను లెక్కించడమనేది అత్యంత దుర్మార్గమైనటువంటిదని, సామాన్య ప్రజల ప్రయోజనాలు కేంద్ర బిందువుగా విధానాలు ఉండాలని ఆయన నొక్కి వక్కాణించారు. జీవీఎంసీ సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి. గంగారావు తొలుత మాట్లాడుతూ రాష్ట్రం లో అతి పెద్ద నగరమైన విశాఖపట్నం రాష్ట్ర విభజన తర్వాత గత పది ఏళ్లలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోకపోగా వున్న ఐటీ పరిశ్రమలు తరలిపోయే పరిస్థితి ఉందని, విశాఖపట్నానికి వెన్నెముక వంటి స్టీల్ ప్లాంట్ ను అమ్మకానికి పెడుతున్నారని, రాష్ట్ర ఖజానా నుండి గత దశాబ్ద కాలంలో ఒక రూపాయి కూడా జీవీఎంసీ కి ఇవ్వలేదు సరి కదా జీవీఎంసీ యొక్క పన్నుల ఆదాయం 350 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వాడుకొంది తప్ప జీవీఎంసీకి ఇవ్వలేదని, దీంతోపాటు వృత్తి పన్నుద్వారా జీవీఎంసి ఏడాదికొచ్చే 60 కోట్లు ఆదాయం రాష్ట్ర బడ్జెట్లోకి తరలించుకు పోతోందని దీనిఫలితంగా నిధులు లేక అప్పులు ఊబిలోకి జీవీఎంసీ కూరుకు పోవడమే కాక ప్రజలపై మరిన్ని భారాలు పడేటట్టు ఆస్తి విలువ ఆధారిత పన్నును తీసుకొచ్చారని, ఇంకా మంచినీరు మురుగునీరు వంటి వాటిని కూడా ప్రైవేటుపరం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలియజేసేరు. పట్టణ పౌర సమైక్య కన్వీనర్ సి.హెచ్.బాబురావు మాట్లాడుతూ యోగా దినం సందర్భంగా విశాఖపట్నం వార్తల్లోకి ఎక్కిందని, ఆరోగ్యం కోసం యోగా మంచిదే కాని, పట్టణ ప్రజలకు, సరైన ఉపాధి, పరిశుభ్రమైన మంచినీరు, ఉండడానికి ఇళ్ళు లాంటివి లేకపోతే ప్రజలు ఎలా ఆరోగ్యంతో ఉంటారని అందువలన ముందు వాటి సంగతి ఆలోచించాలని ఒకప్పుడు పోస్టల్ కాలనీ, బ్యాంకు కాలనీ, ఎలక్ట్రిసిటీ కాలనీ వంటివి ఉండేవని వీటిని ప్రభుత్వం ప్రోత్సాహించేదని ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లోకి గృహ నిర్మాణం వెళ్ళిపోయిందని జీవీఎంసీ లాంటిస్థానిక సంస్థలను దిగజార్చి ప్రభుత్వాలు పెత్తనం చేస్తున్నాయని, పౌర సేవలన్నింటిని ప్రైవేట్ పరం చేసి చార్జీలు వసూలు చేస్తున్నాయని, ఇదే కొనసాగితే మునిసిపల్ కార్పొరేషన్ కాస్తా మునిసిపల్ కంపెనీగా మారుతుందని మార్కెట్ విలువ ఆధారంగా ఇంటి పన్ను వేయడం అనేది దుర్మార్గమని, ఇళ్ల పట్టాలు లేనివారికి రెట్టింపు ఆస్తి పన్ను విధించ బూనడం మరింత దుర్మార్గమని, స్మార్ట్ మీటర్లు తేవడం ద్వారా విద్యుత్ చార్జీలు విపరీతంగా పెరుగుతాయాని, కరెంటు రేటు పగలు ఒకలాగా, కరెంటు ఎక్కువగా వాడే రాత్రి సమయాల్లో మరింత ఎక్కువ రేటు ఉంటుందని, ప్రజల జేబులు కొల్లగొట్టే పౌర సదుపాయాలను వ్యాపార వస్తువులుగా మార్చేస్తున్న పద్ధతిని ప్రజా ఉద్యమాలు ద్వారా త్రిప్పి కొట్టాలని, అలా ఉద్యమించడం ద్వారానే చెత్త పన్నును రద్దు చేయించగలిగేమని, కావున పౌరులంతా ఐక్యమై ఉద్యమించాలని తెలిపారు. సిపిఐ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ ఏ జె స్టాలిన్ మాట్లాడుతూ గతంలో మున్సిపల్ కౌన్సిల్ కున్న ప్రాధాన్యత ఇప్పుడు లేదని నిర్ణయాలన్నీ ఎక్కడో జరిగి జీవీఎంసీ పై రుద్దడం జరుగుతోందని మార్కెట్ వాల్యూ ఆధారిత పన్నును కచ్చితంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ సెక్రటరీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నగర అభివృద్ధి అజెండాలో మధ్యతరగతి వారితో బాటు మురికి వాడల ప్రజల సమస్యలను కూడా అభివృద్ధి లో ప్రధాన అజెండాగా తీసుకురావాలని, పోరాడితేనే హక్కులు వస్తాయని ఆయన తెలియజేశారు. వార్వా అధ్యక్షులు ఎన్. ప్రకాశరావు మాట్లాడుతూ చెత్త పన్ను, యు జి డి పన్ను వంటి వాటిపై వార్వా ఆధ్వర్యం లో నిర్వహించిన కార్యక్రమాలు , ఉద్యమాలు గురించి తెలిపారు. నివాస్ యొక్క కార్యదర్శి పిట్ట నారాయణమూర్తి మాట్లాడుతూ ప్రజల మీద మరిన్ని భారాలు వేస్తూ ప్రైవేటు వారికి దోచిపెట్టే రీతిలో జీవీఎంసీ నడుస్తోందని, ప్రజలపై భారాలు పడకుండా ఉండేటట్లుగా కృషి చేయాలని, అందుకు అనుగుణంగా తీసుకునే నిర్ణయాల అమలుకు కృషి చేస్తామని తెలిపారు. మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం చైర్మన్ పి. మధు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల మీద, ఆస్తి పన్ను మీద రాబోయే కాలంలో విశాఖపట్నంలోని కలిసొచ్చే పౌర సంఘాల్ని కలుపుకొని భారీ సదస్సు నిర్వహించడం ద్వారా ప్రజల్ని చైతన్యవంతులు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సు కు తొలుత విజ్ఞాన కేంద్రం పరిశోధనా విభాగం బాధ్యులు డాక్టర్ కె. పద్మ గారు ఆహ్వానం పలుకగా, విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల ఇంచార్జ్ జి ఎస్ రాజేశ్వరరావు అధ్యక్షత వహించారు.

నేడు జివిఎంసిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం

- మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోను, అన్ని జోనల్ కార్యాలయాలలోనూ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం" 2025 జూన్ 30 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించబడునని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ పత్రికా ప్రకటన ద్వారా ఆదివారం తెలిపారు. కావున, నగరంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, నీటి సరఫరా, వీధి దీపాలు,హారికల్చర్, రెవిన్యూ, యుసిడి, ఇంజినీరింగ్ విభాగం మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై జూన్ 30 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను తెలియపరుచుకోవచ్చునని నగర ప్రజలకు విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తెలియచేశారు.

VASTU HOUSING FINANCE

వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్
యూనిట్ 203 & 204, 2 వ అంతస్తు, "ఎ" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సేవ్రి (వెస్ట్), ముంబై 400015. మహారాష్ట్ర.
సిఐఎన్ నం. : యు65922ఎంహెచ్2005పిఎల్‌సి272501

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్టు చట్టం -2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు-2002 నిబంధన 9తో చదివే సెక్షన్ 13(12) కింద అతనికి సంక్రమించిన అధికారాలను ఉపయోగించి వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ అధీకృత అధికారిగా ఈ దిగువ సంతకందారు ఈ కింద పేర్కొన్న రుణగ్రహీతలకు సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోగా సంబంధిత నోటీసులో పేర్కొన్న బకాయిలను తిరిగి చెల్లించవలసిందిగా ఈ కింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. రుణగ్రహీతలు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పైన పేర్కొన్న చట్ట నిబంధనల్లో నిబంధనల 9తో చదివే సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు ఈ కింద వివరించిన షెడ్యూల్ ఆస్తిని స్వాధీనం చేసుకోవడమైనది. ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని,ఈ ఆస్తితో ఏ ఒప్పందాలైనా ఈ కింద పేర్కొన్న మొత్తం బకాయి మరియు దానిపై వడ్డీ, వ్యయాలు మొదలైనవాటి కొరకు వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ బ్రాంచ్ చార్జికి లోబడి వుండునని ప్రత్యేకించి రుణగ్రహీత , హామీదారు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

వ. నం.	రుణగ్రహీత, సహ-రుణగ్రహీత పేరు మరియు లోన్ ఎకౌంట్ నం.	డిమాండ్ నోటీసు తేదీ మొత్తం బకాయి	ఆస్తి యొక్క వివరాలు	స్వాధీనత రకం & తేదీ
1	నూకరాజు పొట్లూరి, రాజేశ్వరి పోతులూరి HL0000000091590	20-జనవరి-24 16- జనవరి-24 నాటికి రూ.2241527	డి.నం. 6-79-2బి/4ఎ, సర్వే నం.72/4, చినగంట్యాడ గ్రామం, గాజువాక మండలం, జి.వి.ఎం.సి పరిధిలు, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530026. 54.05 చదరపు గజాల కొలత. హద్దులు: ఉత్తరం: పి.అనిత ఆస్తి, దక్షిణం: కె.అప్పలనాయుడు ఆస్తి, తూర్పు: 15 అ॥ల రోడ్డు, పడమర: ఏపిఐఐసి స్థలం.	భౌతిక స్వాధీనత స్వాధీనత తేదీ: 25-జూన్-2025

తేదీ: 30.06.2025
ప్రదేశము: విశాఖపట్నం
అధీకృత అధికారి
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్